క్లుప్తంగా

డాక్టర్ అక్షితకు నారీశక్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ అక్షిత

సిరిసిల్లకల్చరల్: నాడీ వైద్యంలో విశిష్ట సేవలు అందిస్తూ గుర్తింపు పొందిన సిరిసిల్లకు చెందిన డాక్టర్ అశ్వితకు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఎన్జీవో ఆధ్వర్యంలో భారత నారీశక్తి ఇంటర్నేషనల్ అవార్డు అందజేసింది. అమెరికా నుంచి ధన్వంతరి ఆయుర్వేద అవార్డు, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా ఈ అవార్డును హైదరాబాద్‌లో అందజేశారు. ఇప్పటికే నాడీవైద్యంలో తెలంగాణ నుంచి ఉత్తమ డాక్టర్‌గా గుర్తింపు పొందిన ఆమెను స్థానికులు అభినందించారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న వంకాయల కార్తీక్

సిరిసిల్లకల్చరల్: పట్టణ ముదిరాజ్ సంఘానికి ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం విద్యానగర్‌లోని మాస్టర్‌మైండ్ స్కూల్ ఆవరణలో జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, ఫిషరీస్ జిల్లా చైర్మన్ చొప్పరి రాంచంద్రం, వైస్ చైర్మన్ దేవయ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, బీసీ సంఘం రాష్ట్ర శాఖ ప్రతినిధి పర్శ హన్మాండ్లు, న్యాయవాది పిట్టల భూమేశ్, సీనియర్ పాత్రికేయులు కరుణాల భద్రాచలం హాజరయ్యారు. ముదిరాజ్‌లు బలమైన శక్తిగా ఎదగాలని, వారిలో ఐకమత్యాన్ని పెంచి అభివృద్ధికి కృషి చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంకాయల కార్తీక్ కోల నరేశ్, ఉపాధ్యక్షులు ఎంబేరి మహేందర్, బొల్లోజి శ్రీనివాస్, కోశాధికారి పోలుక ఆనంద్, సహాయ కార్యదర్శులు రాగుల నరేశ్, పండుగ రాజు, కార్యవర్గ సభ్యులు పండుగ దేవయ్య, గొడుగు అరుణ్‌చంద్, కరుణాల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

సన్మానం



వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన కముటం తిరుపతి ఇటీవల గ్రూప్ 2 ఫలితాల్లో ప్రతిభచాటాడు. ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బానోతు రాజు నాయక్ ఆదివారం సన్మానించారు. గ్రామం నుంచి ఇద్దరు దంపతులు ఎస్సైలు తిరుపతి, కావ్య దంపతులను పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు భూక్య ప్రకాశ్‌నాయక్ , ఏఎంసీ డైరెక్టర్ సంతోష్ నాయక్, నాయకులు భూక్య దేవేందర్, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కోనరావుపేట: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. మండలంలోని కనగర్తిలో వ్యవసాయ క్షేత్రాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే రైతులు తెలపాలన్నారు. సెస్ లైన్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, రైతులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లోకి వెళ్లేదెలా?

సిరిసిల్లటౌన్: ఈ చిత్రంలోని కనిపిస్తున్నది సిరిసిల్ల కొత్త బస్టాండ్ ప్రాంగణం. ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లే దారిలో ఇలా నిత్యం వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అడ్డంగా వాహనాలు నిలపడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫాం పైకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ముందు వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి మోక్షం

- 'సాక్షి' వరుస కథనాలతో స్పందన
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ
- మాన్వాడలో 20 గుంటల మేర ఇరిగేషన్ స్థలం కేటాయింపు
- నాలుగు గ్రామాలకు మెరుగవనున్న విద్యుత్
- త్వరలోనే టెండర్లు



మాన్వాడలో సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

బోయినపల్లి : మండలంలోని మాన్వాడలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎట్టకేలకు అడ్డంకులు తొలిగాయి. మూడేళ్లుగా స్థల సమస్యతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవాంతరాలు ఏర్పడిన విషయం తెలిసిందే. మాన్వాడ వాసుల విద్యుత్ కష్టాలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సైతం ప్రత్యేక చొరవ తీసుకొని మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన స్థలంలోంచి సర్వే నంబర్ 317లో 20 గుంటల స్థలం కేటాయిస్తూ ఇరిగేషన్ అధికారులతో అంగీకార పత్రం ఇప్పించారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు

మాన్వాడలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరుచేస్తూ ఎన్పీడీసీఎల్ మూడేళ్ల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్ల మేర నిధులు మంజూరుచేశారు. కాగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సమస్య ఏర్పడింది. ఇరిగేషన్ ఆధీనంలో ఉన్న స్థలం ఇచ్చేందుకు అధికారులు మొదట అంగీకరించలేదు. దీంతో సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ స్థల సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ సీనియర్ అధికారులతో మాట్లాడటంతో స్థల సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది.

నాలుగు గ్రామాలకు మెరుగైన విద్యుత్

మాన్వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే మండలంలోని మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట, వెంకట్రావుపల్లి గ్రామాలతో పాటు ఇల్లంతకుంట మండలంలోని కొన్ని గ్రామాలకు మెరుగైన విద్యుత్ అందుతుందని సెస్ ఏఏఈ ప్రశాంత్ తెలిపారు. నాలుగు గ్రామాల్లో అన్ని రకాలు కలిపి 2,310 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం వెంకట్రావుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ కింద 9 గ్రామాలు ఉండడంతో తరచూ లో వోల్టేజీతో పాటు, విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. మాన్వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే లో వోల్టేజీ, ఓవర్ లోడ్ సమస్య తీరుతుంది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పుడున్న ఎస్ ఎస్ఆర్ రేట్లకు అనుగుణంగా ఎన్పీడీసీఎల్ వారు సుమారు రూ.150 కోట్ల నిధులు మంజూరుచేశారు. కాగా నిధులు మంజూరు చేసి ఏళ్లు గడిచినా ఇప్పుడు ముడి సరుకులు, పెరిగిన ధరలకు అనుగుణంగా రీ ఎస్టిమేషన్ వేసి మళ్లీ నిధులు మంజూరుచేసి టెండర్లు పిలుస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

లో వోల్టేజీ సమస్యకు చెక్



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు స్థలం లేదన్న విషయాన్ని గ్రామస్తులు, సెస్‌డైరెక్టర్, మండల నాయకులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి 20 గుంటల స్థలం ఇప్పించాం. లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి మాన్వాడలో సబ్‌స్టేషన్ నిర్మించాలని అధికారులకు ఆదేశించాం.

–మేడిపల్లి సత్యం ఎమ్మెల్యే

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



మాన్వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాం. విద్యుత్ సబ్‌స్టేషన్ లేకపోవడంతో తరచూ లో వోల్టేజీ, ఓవర్ లోడ్ తదితర సమస్యలు ఏర్పడ్డాయి. ఇప్పుడు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకావడంతో విద్యుత్ కష్టాలు తీరుతాయి.

– ఐల శివరాం, మల్లాపూర్

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ



మాన్వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి 20 గుంటల మేర స్థలం ఇప్పించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలో టెండర్లు పిలుస్తారు.

– కొట్టెపెల్లి సుధాకర్, సెస్‌డైరెక్టర్, బోయినపల్లి

నర్సింగ్ సిబ్బందికి జర్మనీలో ఉపాధి అవకాశాలు

- జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘవేందర్

సిరిసిల్ల: అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ విన్ ప్రాజెక్టులో భాగంగా జర్మనీలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ అందించి, నియామకాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పనిచేస్తుందరన్నారు. రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా జర్మన్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ (బీఏ), జర్మన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జీఐజెడ్) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాఘవేందర్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నుంచి జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ చేసిన 21–38 ఏళ్ల మధ్య వయస్సున్న అభ్యర్థులకు, ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో జీఎన్ఎం అభ్యర్థులకు కనీసం మూడేళ్ల ప్రొఫెషనల్ వర్క్ అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మెరుగైన వేతనాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9440051581/ 94400 48500/ 94400 52081 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల: పట్టణ శివారు చిన్నబోనాల (10వ వార్డు)లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'గావ్ చలో బస్తీ చలో' లో భాగంగా పోలింగ్ బూత్‌స్థాయిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి కొండా నరేశ్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు వేణుగోపాల్, పడిగే సురేశ్, పల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నర్సింగాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో ఆదివారం రాత్రి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోళ్ల కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ మాజీ చేర్మెన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చేర్మెన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఏనుగుల కనుకయ్య, సంబ లక్ష్మిరాజం, లాల్ కనుకయ్య, పిట్టల రమేశ్, ప్రవీణ్, గుంటి జలేందర్, ఐరెడ్డి రాజ్యలక్ష్మి, మల్లేశం తదితరులు ఉన్నారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై పోలీసులు ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్రవాహనదారులకు జరిమానాలు విధించారు. మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



తంగళ్లపల్లి : ఇందిరమ్మకాలనీలో చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ (చోటు) అన్నారు. ఆదివారం మండలంలోని ఇందిరమ్మకాలనీలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చోటు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్యాం, భాగ్యలక్ష్మి, యమున, మందాటి శారద, సంపతి శ్యామల, పోతు అనిత, దికొండ జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: దుమాలలో సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.70వేల విలువైన చెక్కులను ఐదుగురికి అందించారు. నాయకులు అందే సతీశ్, కదిరె శ్రీనివాస్, అంజయ్య, సతీశ్, రాజు, కొమురయ్య, మహేశ్, నర్సయ్య, సూర్యం, రాజయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల అర్బన్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈఈ పృథ్వీధర్ గౌడ్ ఆదివారం తెలిపారు. విద్యుత్ వైర్లకింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున దుమాల, వెంకటాపూర్, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీర్నపల్లి: అడవిపదిర సబ్‌స్టేషన్ పరిధిలో అడవిపదిర, లాల్‌సింగ్ తండాలో సోమవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేశ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చర్చిలో ప్రార్థనలు

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్లోరియస్ గాస్పల్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి మాజీ సర్పంచ్ ముత్యాల ఆనందరెడ్డి(65) ఆదివారం రాత్రి బ్రెయిన్‌స్ట్రోక్‌తో హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆనందరెడ్డి మృతితో రాచర్లగొల్లపల్లిలో విషాదం అలుముకుంది. గ్రామ సర్పంచ్‌గా దాదాపు ఏడేళ్లు పనిచేశారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆనందరెడ్డి మృతిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి సంతాపం తెలిపారు.



గంభీరావుపేట : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తంగళ్లపల్లి : సమావేశమైన పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి/గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.ఒకరినొకరు అప్యాయంగా మాట్లాడుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులకు సన్మానించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో 1982–83 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మల్లాపూర్‌లోని తిరుపతి రావు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. వరంగల్ మార్కెట్ చైర్మన్ ఉప్పుల శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ విశ్వనాథం, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ మాధవరెడ్డి, సిద్దిపేట సీడీపీవో శారద రావు, ప్యాక్స్ డైరెక్టర్ రవీందర్ రావు, అత్యం లింగయ్య గౌడ్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ శివారు రహదారి వెంట చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రెండు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పలు వ్యాధులబారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మురుగుకాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సత్తయ్య, ఎంపీడీవో, సెల్ నంబర్: 9989773073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048.





కరాటేతో ఆత్మవిశ్వాసం

సిరిసిల్ల: కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొంతుందని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ మంజుష అన్నారు. సిరిసిల్ల మున్నూరుకాపు సంఘం భవనంలో ఆదివారం స్పార్క్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విన్యాసాలు, దేహదారుఢ్య పరీక్షలు, బ్లాక్ బెల్టుల ప్రదానం కార్యక్రమం జరిగింది. కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కుంగ్ ఫూ హ్యాండ్ మూమెంట్స్, కటాస్, ఫైట్, నాంచాక్ మూమెంట్స్, స్టిక్ రోలింగ్, ఫైర్‌తో స్టిక్ రోలింగ్ విన్యాసాలు ప్రదర్శించారు. శారీరక దేహదారుఢ్య పరీక్షలో 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చోడిబోయిన శివేష్, ఎల్లే హరిహర బ్లాక్ బెల్టు సాధించారు. మరో ఆరుగురు ఎల్లో బెల్ట్, ఎనిమిది మంది ఆరంజ్, మరో ఎనిమిది మంది గ్రీన్, పది మంది బ్లూ, ఎనిమిది మంది బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. కరాటే విన్యాసాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బెల్టులను, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, కరీంనగర్ వన్ టౌన్ ఎస్సై సాయికృష్ణ, డెంటిస్ట్ డాక్టర్ శివరామకృష్ణ, సైకాలజిస్ట్ కె.పున్నంచందర్, బీజేపీ నాయకులు దుమాల శ్రీకాంత్, మాస్టర్ గగ్గూరి దివ్య, మాస్టర్ వోడ్నాల అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి బోరు సదుపాయం లేకపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండ్రోజులకోసారి వాటర్ ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నిర్మాణంలో అనంతగిరిలోని హైస్కూల్, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, అనంతగిరి ప్రాథమిక పాఠశాలలు మునిగిపోయాయి. ఈ మూడు పాఠశాలలు ఒకేచోట నిర్మించారు. పూర్తిస్థాయిలో వసతులు పాఠశాలల్ల వసతులు కల్పించలేదు. మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ ద్వారా పాఠశాలలోని వాటర్‌ట్యాంక్‌లోకి నీరు నింపుతున్నారు. ఆనీరు సరిపోకపోవడంతో గ్రామ పంచాయతీ ద్వారా వాటర్ ట్యాంకర్‌తో పాఠశాలకు నీరందిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు ఎండీ గౌస్ తెలిపారు. పాఠశాలలో బోరు వేయించాలని అధికారులను కోరుతున్నారు.

నియామకం



కొక్కు దేవేందర్ యాదవ్

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గ్రామానికి చెందిన కొక్కు దేవేందర్‌యాదవ్ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ప్లీనరి సమావేశంలో ఆయనను దాదాపు వెయ్యి మంది ప్రతినిధులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన నియామకంపై మానవ హక్కుల ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ సత్కరించారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముస్తాబాద్: మండలకేంద్రంలో కార్పొరేట్ జ్యువెలరీ దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దని స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య డిమాండ్ చేశారు. స్వర్ణకారుల సంఘం సమావేశం ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరికి జ్యువెలరీ దుకాణాలు ఇస్తున్నారన్నారు. దీంతో స్థానికంగా పనిచేస్తున్న వందమంది స్వర్ణకారులు ఉపాధిని కోల్పోతారని తెలిపారు. ఇతర రాష్ట్రాల జ్యువెలరీ దుకాణాల యజమానులు వినియోగదారులను మోసం చేస్తున్నారని, ఇప్పటికే ఇతర జిల్లాల్లో కేసులు నమోదయ్యాయన్నారు. మండల కేంద్రంలో అనుమతులు ఇవ్వవద్దని పంచాయతీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇక్కడ సంఘం నాయకులు విశ్వనాథం, ఈశ్వరయ్య, అనిల్, సతీశ్, రవి, శ్రీనివాస్, లక్ష్మణ్, సంతోష్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



గూడు కల్పించండి సారూ

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సామల్ల శంకరవ్వ. మండలకేంద్రానికి చెందిన ఈమె అప్పులు తీసుకువచ్చి ఒక్కాగానొక్క కూతురుకు వివాహం జరిపించింది. ఇప్పుడు తనకు ఉండేందుకు ఇల్లులేక ఓపూరి గుడిసెలో ఉంటోంది. వర్షాకాలంలో గుడిసెలోకి నీరుచేరి ఇబ్బంది పడుతున్నానని శంకరవ్వ తెలుపుతోంది. ప్రజాపాలనలో రెండుసార్లు ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసినా జాబితాలో తన పేరు రాలేదని, ఇప్పటికైనా అధికారులు పరిశీలించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటోంది.

– వీర్నపల్లి